క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం నిర్వహించారు. హోమంలో పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు, గుంతపల్లె గ్రామాల్లో వర్షం కారణంగా నేలకొరిగిన వరిపంటను మంగళవారం మండల వ్యవసాయాధికారి కౌశిక పరిశీలించారు. అలాగే పెద్దుళ్లపల్లె, పాయలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ ఏఓ శైలజ మాట్లాడుతూ కాలిబాటలు తీసుకోవడం వలన సుడిదోమ రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు గోవర్ధన్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దారిని పరిశీలించిన ఆర్డీఓ



ముత్తుకూరు రెవెన్యూ పొలంలో దారిని పరిశీలిస్తున్న ఆర్డీఓ, రెవెన్యూ అధికారులు

అట్లూరు : మండల పరిధిలోని ఎర్రబల్లి, ముత్తుకూరు రెవెన్యూ పొలాలలోని దారి కోసం రైతుల ఫిర్యాదు మేరకు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ మంగళవారం పరిశీలించారు. ఎర్రబల్లి రెవెన్యూ పొలంలోని సర్వే నంబరు 266లో గతంలో ఉన్న దారిని కేటాయించాలని పోలు శంకరయ్య ఫిర్యాదు చేశారు. అలాగే ముత్తుకూరు రెవెన్యూ పొలంలో తన పొలానికి దారి చూపించాలని చిట్టెంవారిపల్లి గ్రామానికి చెందిన సుంకర సిద్దయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శిరీషా, ఆర్ఐ రమణ, సర్వేయర్ వేణుగోపాల్, నరసింహారెడ్డి, వీఆర్ఓ వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల వయో పరిమితి పెంచాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

బి.కోడూరు : జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల వయో పరిమితిని 60 నుంచి 62 సంవత్సరాల వరకు పెంచాలని సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు గంగిపోగు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు డీఏతో కూడిన పేస్కేల్ కూడా అమలుచేసి ఆదుకోవాలన్నారు.

రోడ్డుపైకి మురికినీరు



రోడ్డుపై పారుతున్న మురికినీరు

పోరుమామిళ్ల : రంగసముద్రం గ్రామంలో ఇళ్ల నుంచి మురికినీరు రోడ్డుపైకి వదులుతుండటంతో ఆ నీరంతా రోడ్డు పొడవునా పారుతోంది. దీంతో పాదచారులకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు మురికినీరు రోడ్డుపైకి వదలడాన్ని నిలుపుదల చేయడమో, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయడమో జరిగితే తప్ప పరిష్కారం లభించదని స్థానికులు పేర్కొంటున్నారు.

వసతి గృహాలు.. సమస్యల నిలయాలు

అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు



ప్రొద్దుటూరులోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో దోర్లు లేని బాత్రూంలు



ప్రొద్దుటూరులోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో తలుపులు లేని కిటికీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద విద్యార్థులకు నివాసమైన సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించడంలో శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 7 సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, 5 బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ మొత్తం 11 ఉన్నాయి. వీటిలో దాదాపు చాలా హాస్టళ్లలో గదుల కిటికీలు, తలుపులు దెబ్బ తిన్నాయి. స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం–2లో దోమల బెడద ఎక్కువగా ఉంది. బాత్రూంలకు తలుపులు తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. బాత్రూంలలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు హాస్టల్ బయట కొళాయి వద్ద స్నానాలు చేస్తున్నారు. కిటికీలకు దోమలు రాకుండా మెష్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. కొన్ని సార్లు హాస్టల్ ప్రాంగణంలో విష కీటకాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఎస్సీ కళాశాల హాస్టల్‌ను రిపేరు చేస్తుండటంతో గత కొన్ని నెలలుగా కళాశాల విద్యార్థులు కూడా బాలుర వసతి గృహంలోనే ఉంటున్నారు. హాస్టల్‌లో బాత్రూంలలో నీటి సౌకర్యం కల్పించాలని, దోమల బెడద తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. మోడంపల్లె ఎస్సీ హాస్టల్–1, ఆనంద నిలయంలో కిటికీలకు మెష్ ఏర్పాటు చేసి దోమల బెడద నుంచి రక్షించాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే ఇటీవల హాస్టల్ గోడ కొంత తొలగించారు. దానిని పునర్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. సాయి రాజేశ్వరి కాలనీలోని బీసీ కళాశాలల బాలుర హాస్టల్‌లో కొన్ని బాత్రూంలు తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కొంత మంది విద్యార్థులు హాస్టల్ ప్రాంగణంలోనే స్నానాలు చేస్తున్నారు. కొన్ని గదుల్లో ఫ్యాన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు బోర్ పంపును రిపేరు చేయించాలని, అలాగే వర్షం వస్తే హాస్టల్ వద్ద నీరు నిలుస్తుందని సమస్యను పరిష్కరించాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.

అధ్వాన హాస్టల్

అట్లూరు : ప్రభుత్వ పాఠశాలలలో చదివే పేద విద్యార్థులకు వసతితో పాటు భోజనం అందించేందుకు ఏర్పాటు చేసిన హాస్టల్ అధ్వానంగా తయారైంది. మండల కేంద్రమైన అట్లూరులో ఒక బీసీ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్ రికార్డుల్లో మాత్రం 58 మంది విద్యార్థులు ఉన్నట్లు ఉంది. సోమవారం రాత్రి సాక్షి విజిట్ చేయగా 21 మంది విద్యార్థులే ఉన్నారు. సోమవారం మెనూ ప్రకారం సాయంత్రం విద్యార్థులకు ఉడికించిన బఠాణి గుగ్గిళ్లు పెట్టాల్సి ఉండగా అవి పెట్టలేదు. రాత్రికి అన్నంతో పాటు ఏదైనా పండు, గుడ్డు, టమాటా కూర, రసం, మజ్జిగ ఇవ్వాల్సి ఉండగా చాలీ చాలని అన్నం, నీళ్లనీళ్లుగా సాంబారు, పసుపు కలిపిన పల్చని మజ్జిగ అందించారు. హాస్టల్‌లో వసతులు ఉన్నా విద్యార్థులు మాత్రం రాత్రి ఏ ఒక్కరూ హాస్టల్‌లో ఉండటం లేదు. అందరూ ఇళ్లకు వెళ్లిపోతారు. దీంతో హాస్టల్‌లో వంటమనిషి, వాచ్‌మన్ మాత్రమే ఉంటున్నారు. ఇదీ అట్లూరులోని సంక్షేమ వసతి గృహాల దుస్థితి.



అట్లూరు బీసీ హాస్టల్‌లో చాలీ చాలని అన్నం



రసం లేకుండా మజ్జిగ మాత్రమే చేసిన దృశ్యం



విద్యార్థుల ప్లేట్లలో కనిపించని గుడ్డు

23న కాలభైరవ స్వామి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రిలయన్స్ సమీపంలోని తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో ఈ నెల 23న శనివారం మహాకాలాష్టమి సందర్భంగా కాలభైరవ స్వామి జయంతిని నిర్వహిస్తున్నట్లు కాలభైరవస్వామి ఉపాసకులు శ్రీనివాసుల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు జీతాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు ప్రభుత్వం వెంటనే జీతాలు ఇవ్వాలని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి నాలుగు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారి జీవనం దుర్భరంగా మారిందన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని బంగారుశీనయ్య హాస్పిటల్‌లో గురువారం ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బంగారు శీనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాహుల్, కార్డియాలజిస్టు డాక్టర్ అంపాబత్తిన గౌరి, యూరాలజిస్టు డాక్టర్ బైన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్యశిబిరం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రూ.10 లక్షల వ్యక్తిగత బీమా



పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానిస్తున్న నాయకులు



మైదుకూరు:గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న సర్పంచ్ నాగేంద్ర బాబు



చాపాడులో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ నిధులతో రూ. 10 లక్షల వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. వరల్డ్ టాయ్‌లెట్స్ డే సందర్భంగా మంగళవారం రంగసముద్రం పంచాయతీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ టాయ్‌లెట్స్ ఉపయోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

మదర్ థెరీసా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి కార్మికులకు రూ. 1500 విలువ చేసే నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేసి సన్మానించారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, ఎంపీడీఓ రమణారెడ్డి, కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సత్కారం

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో మంగళవారం పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సర్పంచ్ బండి నాగేంద్ర బాబు సత్కరించారు. వారికి దుస్తులు, బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే కాక, చెత్త నుంచి ఎరువులను తయారు చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ నాగేంద్ర బాబు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

చాపాడు : ప్రపంచ మరుగుదొడ్ల నివారణ దినోత్సవం సందర్భంగా చాపాడులోని గ్రామ సచివాలయంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సర్పంచ్ మహబూబ్ బీ, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించండి



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు పట్టణం నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం –1కు ప్రహరీగోడ నిర్మించాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు మంగళవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కోరారు. గతంలో ఉన్న గోడను కూల్చివేశారని, తిరిగి అదే ప్రదేశంలో ప్రహరీ నిర్మించాలన్నారు. వసతి గృహం–1, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం (ఆనంద నిలయం) ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం అక్కడే ఉన్నాయన్నారు. మున్సిపల్ హైస్కూలుకు చెందిన మూడు తరగతి గదులు హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించారన్నారు. తరగతి గదులకు వెళ్లేందుకు హాస్టళ్ల ప్రహరీ కూల్చివేశారన్నారు. ఇందువల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్ల నుంచి మురికి నీరు బయటికి వెళ్లేందుకు అవకాశం లేకుండా ఉందన్నారు. విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హాస్టల్ ప్రహరీని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, నరసింహ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రొద్దుటూరు:ముగింపు సమావేశ దృశ్యం



ఖాజీపేట:విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అధికారులు



అట్లూరు: విజేతలతో గ్రంథాలయ సిబ్బంది, అధికారులు

ప్రొద్దుటూరు : విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న వేమన గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పి.రాజగోపాల్‌రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ జి.వెంకటరామిరెడ్డి, రిటైర్డు ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు గురివిరెడ్డి, లక్ష్మిరెడ్డి, నరసింహారెడ్డి, డాక్టర్ పెంచల్ రెడ్డి, సి.ఓబుళ కొండారెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఖాజీపేట : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నాగస్వర్ణలత అన్నారు. 57వ గ్రంథాలయ వార్షికోత్సవం సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయంలో గడపాలన్నారు. గ్రంథాలయ నిర్వహణ అధికారి హరికృష్ణ మాట్లా, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, మీకోసం సేవా సంస్థ పుల్లయ్య, బీడీసీ నిర్వాహకుడు పుల్లయ్య పాల్గొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : అట్లూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌బాబు, ఈఓపీఆర్డీ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆనంద, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు వెంకటేష్, చంద్రకళ, హిందీ పండిట్ చంద్రకళ, శ్రీవిద్య హైస్కూల్ ఉపాధ్యాయురాలు కుమారి హాజరయ్యారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : నేటి విద్యార్థినులు, యువతులు ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆంధ్ర విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ ప్రహల్లాద్ పేర్కొన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా మంగళవారం గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్త్రీ తలుచుకుంటే ఏదైనా సాధించగలదని ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. తొలుత ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నివాళి

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రన్న కొట్టాలులో నివాసం ఉంటున్న ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నరసింహులు తండ్రి గడ్డం సుబ్బరాయుడు గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య వారి నివాసం వద్దకు వెళ్లి సుబ్బరాయుడు భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

తెగుళ్లను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చాపాడు : పంటలు సాగు చేసుకునే క్రమంలో రైతులు తెగుళ్లను తట్టుకునే విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. మండలంలోని వి.రాజుపాలెం గ్రామంలో మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందన్నారు. పలు చోట్ల తెగుళ్లు సోకుతున్నట్లు గుర్తించామన్నారు. వేరుశనగ పంట సాగు చేసే రైతులు విషశ్రీ 1694 రకం సాగు చేయడం వలన ఆకు మచ్చను బాగా తట్టుకుంటాయన్నారు. ధరణి, లేపాక్షి, నిత్య హరిత రకాలను సాగు చేయడం వలన తెగుళ్లను తట్టుకోవడమే కాకుండా మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ జెరూష తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి



ఖాళీ జాగాల్లో పెరిగిన కంపచెట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ జాగాల్లో ఉన్న కంపచెట్లను తొలగించడంతో పాటు డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించి రోడ్లపై చెత్త వేయకుండా పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంజనేయనగర్, రాధాకృష్ణనగర్‌లలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు, బోర్డులను ఉంచడం ద్వారా పూడికతీత పనులకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సతీష్, టీపీబీఓలు నరసయ్య, సుధాకర్, ఏఈ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, శానిటేషన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శమైన వనిత ఇందిరమ్మ



ఖాజీపేట:ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



రాజుపాళెం: ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయురాలు



ప్రొద్దుటూరు:ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం తదితరులు

ఖాజీపేట : మన దేశానికే ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకురాలు మాజీ ప్రధాన మంత్రి ఇందిరమ్మ అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమణ అన్నారు. ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని బాలికల ఉన్నత పాఠశాలలో ఇందిరా గాంధీ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాల వల్ల దేశ పురోగతికి ఎంతో మేలు కలిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగస్వర్ణలత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేం

రాజుపాళెం : మన దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేమని రాజుపాళెం గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి ఉపాధ్యాయురాలు హరిప్రియ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎల్ఎం ఎన్వీ నారాయణరెడ్డి, హనుమంత్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం భారత దేశ తొలి మహిళా ప్రధాన మంత్రిగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత వైమానిక దళాధికారి వెంకట కొండయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర రాజు, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు గ్రంథాలయంలో..

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ, డ్వాక్రా, ఐఈఆర్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరు పోలీసు స్టేషన్ సమీపంలోని ఇందిరా విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదకు మంచి జరిగిందన్నారు. దేశంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన, అమర్‌రెడ్డి, గోపాల్, వెంకటసుబ్బయ్య, బాబ్జీ, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

బద్వేలు అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ రూరల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికి కూడు, గూడు, గుడ్డ అందించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలదేనన్నారు. ఆ బాధ్యతను విస్మరిస్తున్న పాలకులను పోరాటాల ద్వారా మేల్కొల్పి పేదలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, మండల కార్యదర్శి ఇమ్మానుయేల్, జిల్లా సమితి సభ్యుడు వెంకటరమణ, ఏఐవైఎఫ్ ఏరియా నాయకుడు అనిల్, రూరల్ సహాయ కార్యదర్శి ఆనందరావు, కమిటీ సభ్యులు విజయకుమారి, సుధాకర్, సుబ్బారెడ్డి, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక బకాసురులపై చర్యలు తీసుకోవాలి

కలసపాడు : ఇసుక బకాసురులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ మధురవాణికి ముద్దంవారిపల్లె దళితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్దంవారిపల్లె దళితుల భూముల్లో ఇసుకను తరలిస్తూ పొలం దున్నడానికి కూడా పనికి రాకుండా చేస్తున్నారన్నారు. దోపిడీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్వకాలం నుంచి దళితులమైన తమకు పిత్రార్జితంగా వచ్చిన ఇనాం భూములలో శంఖవరం గ్రామ పొలం సర్వే నంబర్ 30, 31, 8, 27, 95 నుంచి 4వ సర్వే నంబర్ వరకు రస్తా ఏర్పాటు చేసి నాలుగు భాగాలుగా కొలతలు వేయించాలన్నారు. ఓబయ్య, ఫ్రాన్సిస్, గురయ్య, రాజశేఖర్, చిన్న వెంకటయ్య పాల్గొన్నారు.